

వేసవిలో రానున్న 'కన్నప్ప'

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' చిత్రం ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ విషయాన్ని సోమవారం చిత్ర నిర్మాత మోహన్‌బాబు అధికారికంగా వెల్లడించారు. భక్త కన్నప్ప వృత్తాంతం ఆధారంగా భక్తిరస ప్రధానంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, ప్రభాస్, శరత్‌కుమార్, మధుబాల, బ్రహ్మానందం వంటి అగ్ర తారలు ఇందులో భాగమవుతున్నారు. ప్రస్తుతం చిత్ర బృందం దేశవ్యాప్తంగా ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకునే పనిలో ఉంది. సినిమా విడుదలయ్యేలోపు పన్నెండు జ్యోతిర్లింగాలను సందర్శిస్తామని మంచు విష్ణు తెలిపారు. సోమవారం ఉజ్జయినీ మహాకాళేశ్వర్ దేవాలయంలో 'కన్నప్ప' రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఈ సినిమాను రూపొందించామని, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని చిత్ర బృందం పేర్కొంది.

ఊహకందని అద్భుతాలు

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 12వందల కోట్ల రూపాయల వసూళ్లను సాధించి, ప్రభాస్ కెరీర్‌లో 'బాహుబలి ఫ్రాంచైజీ' తర్వాతి స్థానాన్ని దక్కించుకుంది 'కల్కి 2898ఏడీ'. ప్రస్తుతం ఈ సినిమా సీక్వెల్‌కి సంబంధించిన అప్‌డేట్ కోసం దేశ వ్యాప్త ప్రేక్షకులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు ఈ చిత్ర నిర్మాతలైన స్వప్న దత్, ప్రియాంక దత్ 'కల్కి 2' గురించి ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మాట్లాడారు. 'ఈ సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. కాకపోతే రెగ్యులర్ షూటింగ్ ఎప్పుడు స్టార్ట్ చేయాలి అనేదానిపై క్లారిటీ లేదు. త్వరలోనే అన్ని విషయాలూ వెల్లడిస్తాం. నిజానికి 'కల్కి 2898ఏడీ'తో పాటే 'కల్కి 2' షూటింగ్ కూడా కొంతమేర జరిగింది. దాదాపుగా 35శాతం షూటింగ్ కంప్లీట్ అయ్యిందని చెప్పొచ్చు. స్క్రిప్ట్‌లో ఏవన్నా బెటర్‌మెంట్స్ జరిగితే తప్ప దాన్ని మార్చేదేం లేదు. ఫస్ట్ పార్ట్‌లో కీలక పాత్ర పోషించిన దీపికా పదుకొణే.. పార్ట్ 2లో కూడా కొన్ని సన్నివేశాల్లో అమ్మగా కనిపిస్తారు. అమితాబ్, ప్రభాస్ పాత్రలు ఫస్ట్‌పార్ట్‌ని మించి ఉంటాయి. ఇంకా ఊహకందని ఎన్నో అద్భుతాలు పార్ట్ 2లో చూస్తారు.' అంటూ చెప్పుకొచ్చారు స్వప్న దత్, ప్రియాంక దత్.

వచ్చే ఏడాది కొత్త సోనాక్షిని చూస్తారు

2024 తన జీవితంలో మరిచిపోలేని సంవత్సరం అంటున్నారు బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా. తన జీవితంలో ఈ ఏడాది నింపిన మధురానుభూతుల్ని ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె నెమరువేసుకున్నారు. 'ఇంకొన్ని రోజుల్లో 2024కు గుడ్‌బై చెప్పబోతున్నామంటే కాస్త బాధగా ఉంది. ఎందుకంటే.. నా జీవితాన్ని ఆనందమయం చేసిన సంవత్సరం ఇది. నేను ఊహించని రెండు సర్‌ప్రైజులు ఈ ఏడాది నాకిచ్చింది. పెళ్లితో జీవితంలోని ముఖ్యమైన ఘట్టాన్ని మొదలు పెట్టాను. అలాగే భన్సాలీ డైరెక్షన్‌లో నటించే అరుదైన అవకాశం 'హీరామండీ'తో లభించింది. అది కూడా భారీ విజయాన్ని అందుకుంది. మరోవైపు 'కాకుడా' చిత్రంతో సోనాక్షి ఎలాంటి పాత్ర అయినా చేయగలదు అని నిరూపణ అయింది. అందుకే అటు వృత్తిపరంగా.. ఇటు వ్యక్తిగతంగా ఈ ఏడాది నాకు స్పెషల్. ఈ సంతోషంతోనే 2025లోకి అడుగుపెడుతున్నాను. వచ్చే ఏడాది నటిగా కొత్త సోనాక్షిని చూస్తారు.' అంటూ చెప్పుకొచ్చింది సోనాక్షి సిన్హా.

తెలుగులో సోలో హీరోగా..

'కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు కన్నడ హీరో రిషబ్ శెట్టి. డివోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమాలో ఆయన నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. ప్రస్తుతం 'కాంతార' చిత్రానికి ప్రీక్వెల్‌గా రూపొందిస్తున్న 'కాంతార-1' షూటింగ్‌లో బిజీగా ఉన్నారాయన. పాన్ ఇండియా చిత్రం 'జై హనుమాన్' ద్వారా రిషబ్‌శెట్టి తెలుగులో ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో ఆయన హనుమంతుడి పాత్రను పోషిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు మంచి స్పందన లభించింది. ఇదిలావుండగా.. రిషబ్ శెట్టి సోలో హీరోగా తెలుగులో ఓ సినిమా చేయనున్నారని తెలిసింది. 'ఆకాశవాణి' ఫేమ్ అశ్విన్ గంగరాజు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారని, అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుందని సమాచారం. కథలోని కొత్తదనంతో పాటు తన పాత్రలోని భావోద్వేగాలు నచ్చడంతో రిషబ్‌శెట్టి ఈ సినిమాకు అంగీకరించారని, ఈ వారంలోనే అధికారిక ప్రకటన వెలువడుతుందని సమాచారం.

బాధ నుంచి బయటపడేందుకే!

'కొన్నింటిని పట్టించుకోకూడదు అనుకుంటాం. పట్టించుకోకుండా ఉండేందుకు ప్రయత్నిస్తాం. కానీ అది సాధ్యమయ్యే పనికాదు. అంతటి మానసిక ధృఢత్వం వందలో ఒక్కరికుంటుంది. నాకైతే లేదు..' అంటూ తన బలహీనతను బహిర్గతం చేసింది బాలీవుడ్ భామ అనన్య పాండే. కెరీర్ ప్రారంభంలో తాను ఎదుర్కొన్న బాధల గురించి ప్రస్తావిస్తూ ఆమె పైవిధంగా స్పందించింది. ' 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' నా ఫస్ట్ సినిమా. ఆ సినిమా టైమ్‌లో నాపై ఏవేవో వార్తలు వస్తుండేవి. వాటిలో ఒకటి మాత్రం నన్ను చాలా బాధించింది. ఎవరో ఓ వ్యక్తి ఇన్‌స్టాలో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసుకుని, తను నా క్లాస్‌మెట్ అయినట్టు పోస్టులు పెట్టేవాడు. నా ఇంటర్వ్యూలలో నా కాలేజ్, స్కూల్ విషయాల గురించి నేను అన్నీ అబద్ధాలు చెబుతున్నానని ఇన్‌స్టాలో కామెంట్లు చేసేవాడు. వాటిని జనం పట్టించుకోరులే అనుకున్నా. కానీ అవే బాగా ట్రోల్ అయ్యాయి. అవి నన్నెంతో బాధించాయి. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయేలా చేశాయి. నేను మానసికంగా అంత బలమైన వ్యక్తిని కాదు. అందుకే.. ఈ బాధ నుంచి బయట పడేందుకు థెరపీ తీసుకోవాల్సొచ్చింది.' అంటూ గుర్తుచేసుకుంది అనన్య పాండే.

ఉత్కంఠ భరితంగా...

వెన్నెల కిశోర్, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్ చేస్తున్న క్రైమ్ కామెడీ థ్రిల్లర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ ఈ చిత్రానికి దర్శకుడు. వెన్నపూస రమణారెడ్డి నిర్మాత. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కీ, పాటలకూ మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ చెబుతున్నారు. డిసెంబర్ 25న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. వెన్నెల కిశోర్ షార్ప్ డిటెక్టివ్‌గా ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. నందిపాటి వంశీ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారనీ, ఆద్యంతం ఉత్కంఠనూ, వినోదాన్ని పంచే సినిమా ఇదని మేకర్స్ తెలిపారు. సీయా గౌతమ్ మరో కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో స్నేహా గుప్తా, రవితేజ మహద్యం, మురళీధర్ గౌడ్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: మల్లికార్జున్, సంగీతం: సునీల్ కశ్యప్.

తెలుగుతెరపై తమిళ సంగీతం

రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్‌బాబు.పి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ద్వారా కోలీవుడ్ సంగీత దర్శకులు వివేక్-మెర్విన్ తెలుగు సినిమాకు పరిచయం అవుతున్నారు. ఈ సంగీతదర్శక ద్వయానికి రామ్ తన సోషల్‌మీడియా ద్వారా స్వాగతం పలికారు. 'తెలుగు తెరపై సరికొత్త సంగీత సంచలనానికి స్వాగతం' అంటూ రామ్ ట్వీట్ చేశారు. తొలి సినిమా 'వడా కర్రీ' వీరికి మంచి పేరు తీసుకురాగా, ప్రైవేటు ఆల్బమ్ 'ఓర్మాడా..', 'పక్కం నీయుమ్ ఇళై..' చార్ట్ బస్టర్లుగా నిలిచాయి. ధనుష్ 'పటాస్', ప్రభుదేవా 'గులేబకావళి', కార్తీ 'సుల్తాన్'.. ఇలా కోలీవుడ్‌లో భారీ సినిమాలకు సంగీతం అందించారు ఈ సంగీత దర్శకద్వయం. తెలుగులో తమ తొలి సినిమా అయిన 'RAPO 22'కు సంగీత ప్రియులు మెచ్చే ఆల్బమ్ ఇచ్చేందుకు ఈ మ్యూజిక్ డైరెక్టర్లు సమాయత్తమయ్యారని చిత్రబృందం చెబుతున్నది.

మన కుటుంబం పాటలు

తెలంగాణ నేపథ్యంలో రూపొందిన కుటుంబ కథాచిత్రం 'మన కుటుంబం'. సుమన్, మురళి గౌడ్, అన్నపూర్ణ, రవి వర్మ, లాస్య, మీనా చౌదరి ఇందులో ప్రధానపాత్రధారులు. ఆకుల రాఘవ దర్శకుడు. కలకొండ హేమలత నిర్మాత. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. చిత్రబృందమంతా కలిసి ఈ ఆడియోను లాంచ్ చేశారు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసి, త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జె.భానుప్రసాద్.

వికటకవి వినోదం

నరేష్ అగస్త్య, మేఘా ఆకాష్ ముఖ్య పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'వికటకవి'. ప్రదీప్ మద్దాలి దర్శకుడు. రామ్ తాళ్లూరి నిర్మాత. ఈ నెల 28న జీ5లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. 'ఇదొక అద్భుతమైన వెబ్‌సిరీస్. కంటెంట్ చూసి నిర్మాతగా గర్వపడుతున్నా. దర్శకుడు ప్రదీప్ పెద్ద స్థాయికి వెళ్తాడు. పనిచేసిన అందరికీ మంచి పేరు తెచ్చే సిరీస్ ఇది' అని నిర్మాత రామ్ తాళ్లూరి అన్నారు. ఇది చాలా పెద్ద స్పాన్ ఉన్న కంటెంట్ అనీ, అద్భుతమైన టీమ్ సెట్టవ్వడం వల్లే ఈ సిరీస్ ఇంత బాగా వచ్చిందనీ దర్శకుడు చెప్పారు. ఇంకా నరేష్ అగస్త్య, మేఘా ఆకాష్, బీవీఎస్ రవి, జీ5 కంటెంట్ హెడ్ సాయి తేజ్, జీ5 బిజినెస్ హెడ్ అనురాధ గూడూరు, సంగీత దర్శకుడు అజయ్ అరసాడ, కెమెరామేన్ షోయబ్ కూడా మాట్లాడారు.

మైథలాజికల్ డ్రామా 'వశిష్ట'

సుమన్‌తేజ్, అనుశ్రీ జంటగా నటిస్తున్న 'వశిష్ట' చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. లిటిల్ బేబీస్ క్రియేషన్స్ పతాకంపై నోరి నాగప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హరీశ్ చావా దర్శకుడు. ముహూర్తపు సన్నివేశానికి నాగబాల సురేష్ కుమార్ క్లాప్‌నిచ్చారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే మైథలాజికల్ సోషల్ డ్రామా ఇది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించబోతున్నాం. ఈ సినిమాకు ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు కుదిరారు' అన్నారు. వినూత్నమైన కథతో ఈ సినిమా తీస్తున్నామని నిర్మాత నోరి నాగప్రసాద్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ గరిమెళ్ల, సంగీతం: షేక్‌మీర్ వలీ, రచన-దర్శకత్వం: హరీశ్ చావా.

కార్పొరేట్ ఆఫీస్ కామెడీ

ఆర్జే కాజల్, అఖిల్ సార్థక్, శుభశ్రీ, మిర్చి కిరణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్ సిరీస్ 'వేరే లెవెల్ ఆఫీస్'. ఇ.సత్తిబాబు దర్శకుడు. వరుణ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై వరుణ్ చౌదరి గోగినేని నిర్మిస్తున్నారు. డిసెంబర్ 12 నుంచి ఈ సిరీస్ ఆహాలో స్ట్రీమింగ్ కానుంది. సోమవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఇ.సత్తిబాబు సిరీస్ విశేషాలు తెలియజేస్తూ 'తమిళంలో 'వేరే మాదిరి ఆఫీస్' వెబ్ సిరీస్‌కు మంచి పేరొచ్చింది. దానిని 50 శాతం మార్పులతో తెలుగులోకి తీసుకొచ్చాం. యువతతో పాటు కార్పొరేట్ ఉద్యోగులకు ఈ సిరీస్ బాగా కనెక్ట్ అవుతుంది' అన్నారు. ఈ సిరీస్‌లో నటిస్తున్నప్పుడు 9 టూ 5 ఆఫీస్‌కు వెళ్లి వచ్చిన అనుభూతికలిగిందని మిర్చి కిరణ్ చెప్పారు. ఈ కార్పొరేట్ ఆఫీస్ కామెడీ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుందని ఆహా కంటెంట్ హెడ్ వాసు తెలిపారు. రీతూ చౌదరి, వసంతిక, మహేష్ విట్టా తదితరులు నటిస్తున్న ఈ సిరీస్‌కు సంగీతం: అజయ్ అరసాడ, దర్శకత్వం: ఇ.సత్తిబాబు.